సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

శుక్రవారం
21 ఫిబ్రవరి
2025
పేజీలు 8

గుంటూరు
పల్నాడు

రియల్ ఎస్టేట్ రంగంలో ఇప్పుడిప్పుడే కిలాడీ లేడీ లు కూడా విజృంభిస్తున్నారు. మాయ మాటలతో ఎంతటి వారినైనా ఇట్టే బురిడీ కొట్టిస్తున్నారు. చేతుల్లో పైసా లేకపోయినా కోట్లు ఉన్నట్లు బిల్డప్ ఇచ్చి నమ్మకంగా ఘరానా మోసానికి తెగబడుతున్నారు. సమాజంలో పేరున్న వ్యక్తులను, మర్యాదస్తులను కూడా మోసం చేస్తున్నారు. మాయ మాటలతో మాయలేడీలు వలవేస్తున్నారు. వాళ్ల చేతికి చిక్కితే పెద్ద చేప చిక్కినట్లే.. లేదంటే బ్లాక్ మెయిల్ చేయటానికి కూడా వెనుకాడటం లేదు. వీళ్ళ మోసాలు చూస్తే బ్రెయిన్ లో నరాలు కట్ అయ్యేలా ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఆడవాళ్లే కదా అని తేలిగ్గా తీసుకున్నా.. జాలి చూపినా, స్నేహం చేసినా మీ కొంప మునిగినట్లే..! బ్లాక్ మెయిల్ కి కూడా లొంగకపోతే కేసులు పెట్టి సెటిల్మెంట్ కి వస్తారు. అదీ సాధ్యం కాకపోతే పలాయనం చిత్తగించి పారి పోవటం వీళ్ళ వంతు.. గుంటూరు జిల్లాలో ట్రెండింగ్ లో ఉన్న ఓ కిలాడి లేడి వ్యవహారంపై ఆసక్తికరమైన కథనం చూద్దాం..

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

## వామ్మో... రియల్ ఎస్టేట్ రంగంలో

# కిలేడీల దందా..!

- మాయ మాటలతో రియల్ వ్యాపారులను బెదిరిస్తున్న వైనం
- రూ.కోట్లు ఉన్నట్లు బిల్డప్ ఇచ్చి ఘరానా మోసం
- బ్లాక్ మెయిల్ చేయడానికి కూడా వెనుకాడరు

మాయ మాటలతో ముందుగా ఈ కిలాడీ లేడీ లు వల వేస్తారు.. మాకు వాళ్లు వీళ్లు తెలుసు అంటూ పెద్ద ఎత్తున బ్లాక్ మెయిల్ కి పాల్పడతారు. ఇప్పటివరకు రియల్ ఎస్టేట్ రంగంలో మాయగాళ్లనే మనం చూసాం. కానీ ఇప్పుడు కిలాడీ లేడీ లు మాయ మాటలతో బురిడీ కొట్టిస్తున్నారు. మగాళ్లేనా..!? మేమేం తీసిపోలేదంటూ గుంటూరు రియల్ ఎస్టేట్ రంగంలో కొందరు మహిళలు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. వీరి అరాచకాలు చూస్తే మనం నివ్వెర పోవాల్సిందే.




ఆ... ఆడోళ్లే కదా... అని మీరు తేలిగ్గా తీసుకుంటే వాళ్ల వలలో చిక్కి విలవిలలాడాల్సిందే.. ఎందుకంటే రియల్ ఎస్టేట్ పేరిట రంగంలోకి దించి అందిన కాడికి లక్షల కొద్ది సొమ్ము గుంజేసి నిండా ముంచేయడం వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య. అదేమంటే కేసులు, పెడతామంటూ బ్లాక్ మెయిలింగ్ లకు దిగుతారు. లేదంటే సెటిల్ మెంట్ చేసుకొని బతుకు జీవుడా అని వెళ్లిపో అంటూ హుకుం జారీ చేస్తారు.ఇలా ఓ మహిళ చేస్తున్న దౌర్జన్యాలు జిల్లాలను దాటిపోవడంతో లబోదిబో మనే బాధితుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. ఇలాంటి వాళ్ల బారి నుంచి తమను కాపాడేవారు లేరా అంటూ బాధితులు బిక్కమొఖం వేసి దిక్కులు చూస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ మధ్యకాలంలో జరిగిన ఓ ఆసక్తికరమైన కథనాన్ని చూడొచ్చు..

నంద్యాల రాజేశ్వరి అనే మహిళ మంగళగిరిలో చినబాబు అనే ఓ థియేటర్ ఓనర్ ని బ్లాక్ మెయిల్ చేసి అక్రమంగా రెండు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె బాధితులు కొంతమంది ఫిర్యాదు చేసేందుకు రెడీ అవుతున్నారు. ఇదే మహిళ గతంలో ఒక ల్యాండ్ వివాదంలో కూడా ఆరోపణలు ఎదుర్కొంటోంది. పెదకాకాని మండలం కంతేరుకు చెందిన ఒక టిడిపి నాయకుడికి రూ .5 లక్షలు ఇచ్చినట్లే ఇచ్చి ఆ తరువాత ఆయనపైనే కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడ్డట్టు సమాచారం.

ఈ కేసులో ఆమె తప్పుడు సమాచారంతో ఇచ్చిపోలీసులను సైతం తప్పుదోవ పట్టించినట్లు మిగతా 3వ పేజీలో



## పరీక్షల వేళ ఒత్తిడి దరిచేరనీయొద్దు

### పదవ తరగతి విద్యార్థులలో స్ఫూర్తి నింపిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** 2024-25 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అనవసర భయాలు, ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫలితాల గురించి అతిగా ఆలోచించకుండా చేయాల్సిన పని గురించి మాత్రమే దృష్టి సారిస్తే ఒత్తిడి దరిచేరదన్నారు. ఒత్తిడికి గురైనప్పుడు తమ భయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవాలన్నారు. పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కేవలం ప్రారంభం మాత్రమేనని.. పరీక్షలకు మించిన జీవితం ఎంతో ఉందన్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలు అనేవి ఎవరో మన జ్ఞానాన్ని కొలిచే కొలమానాలుగా కాకుండా మన జ్ఞానాన్ని ప్రదర్శించే అవకాశాలుగా భావించాలన్నారు. ఎప్పటికప్పుడు చేసిన పొరపాట్లను గుర్తించి వాటిని సరి చేసుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. నిపుణులు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సమయానికి తగ్గట్టు టైం టేబుల్ తయారు చేసుకుని క్రమ పద్ధతిలో చదవాలన్నారు. పరీక్షల సమయంలో బాగా చదవడంతో పాటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. పరీక్షల ముందు రోజు అర్ధరాత్రి వరకూ చదివి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటే పరీక్షలు రాయలేని పరిస్థితి వస్తుందని హితవు పలికారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టేందుకు ' స్ఫూర్తి ' కార్యక్రమం ద్వారా ఆన్ లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సమావేశంలో డీఈవో చంద్రకళ,రిటైర్డు ఐఏఎస్ బి.రాజేశ్వర రావు, వ్యాపార వేత్త వీర రాఘవ రావు, ట్రైనర్లు బొండ్లపాటి రాధిక, చిన్నం వెంకట్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ యూ ట్యూబ్ లో జిల్లాలోని 456 పాఠశాలల మేనేజ్ మెంట్లు మరియు పదవ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మారక ద్రవ్యాల వినియోగంపై

# ఉక్కు పాదం మోపండి

- నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం
- అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- విద్యాసంస్థల దగ్గర నిఘా పెంచండి
- మారకద్రవ్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై అవగాహన కల్పించండి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్యబ్యూరో**

జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు సంబందిత శాఖలు సమన్వయంతో నిబద్ధతతో బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తో కలసి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ సీ ఓ ఆర్ డీ ) జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ గంజాయి, ఎండీఎం, కోకైన్ వంటి మాదక ద్రవ్యాలు ఎక్కువుగా 18 నుంచి 24 వయస్సు వారు తీసుకుంటున్నారని, జిల్లాలోకి అక్కడక్కడ మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు సైతం నమోదు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగంను అరికట్టేందుకు పర్యవేక్షణకు అంతర్గతంగా ప్రత్యేకంగా కమిటీలను పదిహేను రోజుల్లో ఏర్పాటు చేసేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కమిటీలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల దుష్పరిణామాలను వివరిస్తూ స్కూల్స్, కళాశాలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్ధలు అమ్మకాలు, వినియోగించేవారు సమచారం తెలిపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14405 టోల్ ఫ్రీ నెంబరును విద్యా సంస్థల్లోను, జనసమ్మర్దన ప్రాంతాల్లో, ముఖ్య కూడళ్ళలోను, సామాజిక మాధ్యమాల్లోను విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసిన కమీటీలకు జిల్లా స్థాయిలోను ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. యూనివర్సీటీలలోను విద్యార్ధులు మాదకద్రవ్యాల వినియోగించకుండా యాజమాన్యలు పటిష్ట చర్యలు తీసుకోవాలని, మాదక మిగతా 3వ పేజీలో

# గ్రూపు-2 పరీక్షలను సజావుగా నిర్వహించాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ వారు నిర్వహిస్తున్న గ్రూప్ -2 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా కొనసాగేలా లైజన్ అధికారులు సమర్దవంతముగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ తో కలసి ఏపీపీఎస్సీ గ్రూప్ -%××% సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల నిర్వహణ పై లైజన్ అఫీసర్లు, చీఫ్ సూపరింటెంట్ లు, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ వారు గ్రూప్ -2 సర్వీసెస్ (నోటిఫికేషన్ నం. 11/2023) ఉద్యోగాల నియామకమునకు సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఈనెల 23వ తేదీ ఉదయం 10.00 గం. ల నుండి 12.30 గం. ల వరకు (పేపర్1) మరియు మధ్యాహ్నం 03.00 గం. ల నుండి 05.30 గం. ల వరకు (పేపర్2) పరీక్షను నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రములలో 9,277 అభ్యర్దులు హాజరవుతున్నారన్నారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రములకు 11 మంది సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించటం జరిగిందన్నారు. లైజన్ అధికారులు ముందస్తుగానే వారికి కేటాయించిన కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించుకొని, చీఫ్ సూపరింటెండ్ లతో కలసి ఇన్వజలేటర్లుకు పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ జారీ చేసిన మార్గదర్శకాలను అవగాహన కల్పించటానికి ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. లైజన్ ఆఫీసర్లు పరీక్ష నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ కాన్ఫిడెన్సియల్ మెటీరియల్ పరీక్ష ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు పర్యవేక్షించాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. పరీక్ష వేళలకు అనుగుణంగా కేంద్రాలు బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపుల ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణలో మానవ తప్పిదాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెంట్ లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మీ, లైజన్ అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.



**అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం**

# ప్రైవేట్ హాస్పటల్లో వైద్య నిబంధన అమలు చేయాలి

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి ఆదేశించారు. అన్ని ప్రైవేటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన సి సెక్షన్ ఆపరేషన్ల ఆడిట్ లో భాగంగా గురువారం స్థానిక శ్రేయ ఐ వి ఎఫ్ సెంటర్ ను,ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ జరిగిన సి – సెక్షన్ డెలివరీస్ రికార్డులను పరిశీలించినారు. సి –సెక్షన్ జరుగుటకు గల కారణములను, పరిశీలించి వీలైనంతవరకు సి సెక్షన్ డెలివరీస్ తగ్గించవలసినదిగా సూచించినారు. తదుపరి స్కాన్ సెంటర్ ను పరిశీలించి నిబంధనలకు లోబడి అన్ని మార్పులు సరి చేసుకోవలసినదిగా సూచించినారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల వారు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారము రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్స్ సకాలంలో చేసుకోవలియునని, ఏ విధమైన లోపాలు గుర్తించిన శాఖపరమైన ఉంటాయని హెచ్చరించినారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వరరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వామ్మో.. రియల్ ఎస్టేట్ రంగంలో కిలేడీల దందా..!

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ టిడిపి నాయకుడి పై బ్లాక్ మెయిలింగ్ పాల్పడి అతడి నుండి రూ 90 లక్షల పైనే గుంజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈమె మోసాలకు సంబంధించి తాజాగా మరో ఆరోపణ వార్తల్లోకి హల్చల్ చేస్తోంది. గుంటూరు కు చెందిన గట్టుపల్లి సుబ్రహ్మణ్యం అనే రియల్టర్ వద్ద ప్లాట్లు అమ్మిపెడతానంటూ ఒక బ్రోకర్ లా పరిచయం చేసుకుంది. చివరకు సుబ్రహ్మణ్యమునే మోసం చేసినట్లు అతను చెబుతున్నాడు. ప్లాట్ల కొనుగోలు అమ్మకాల్లో ఘరానా మోసాలకు పాల్పడటమే కాకుండా అతడిపై, అతడి కుటుంబ సభ్యులపై ఎదురు కేసులు పెట్టి వేధిస్తోందని సుబ్రహ్మణ్యం వాపోయాడు. తనపై, తన కుటుంబ సభ్యులపై నంద్యాల రాజేశ్వరి పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టి వేధిస్తున్నట్లు చెప్పారు. ఆమె తనను మోసగించిన వైనంపై సుబ్రమణ్యం మీడియాకు వివరించాడు. బాపట్ల జిల్లా యాజలిలో మంతెన లక్ష్మి అనే మహిళ భూమిని బిల్డర్ సుబ్రహ్మణ్యం ద్వారా 45 ప్లాట్లను నంద్యాల రాజేశ్వరి, నంద్యాల శశిధర్ రెడ్డి భార్య శాంతి, చదలవాడ రేణుక, చదలవాడ సుధాకర్ లకు తాను రిజిస్ట్రేషన్లు చేసినట్లు చెప్పారు. లండన్ లో ఉన్న రాజేశ్వరి కొడుకు, అమెరికాలో ఉన్న, సుధాకర్ కొడుకు పేరు మీద ఈ ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగినట్టు తెలిపారు. అదేవిధంగా రాజేశ్వరి బంధువులకు 8 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు సుబ్రమణ్యం చెప్పారు. వీటికి సంబంధించిన సొమ్ము రూ.35 లక్షలు సుబ్రమణ్యంకు రూ.25 లక్షలు భూమి యజమాని లక్ష్మికి ఆన్లైన్ పేమెంట్ చేశామని సుబ్రమణ్యం తెలిపారు. ఈ ప్లాట్ లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లన్నీ 2023 జనవరి నుండి డిసెంబర్ వరకూ జరిగినట్లు చెప్పుకొచ్చారు. అయితే వాళ్లంతా ఈజీ మనీ కోసం గ్రూపులాగా తయారై ఒక పథకం ప్రకారం తనను బెదిరిస్తున్నాని ఆయన ఆరోపిస్తున్నారు.

**లండన్ టు గుంటూరు...**

రాజేశ్వరి కొడుకు లండన్ లో ఉంటాడని...అతడు ఫోన్లో రికార్డు అయిన సంభాషణలను ఎడిటింగ్, మార్ఫిం గ్ చేస్తుంటాడని, ఆ తరువాత రాజేశ్వరి వాటి సాయంతో వ్యక్తులను భయభ్రాంతులకు గురి చేయడం, వాటి ఆధారంగానే పోలీస్ స్టేషన్లలో అక్రమ కేసులు పెట్టడం చేస్తోందని చెప్పారు. ఆ విధంగా ఆ మహిళ బ్లాక్ మెయిలింగ్ లకు పాల్పడుతూ లక్షల్లో డబ్బులు కాజేస్తున్నారని సుబ్రమణ్యం చెబుతున్నారు. యాజిలిలో రాజేశ్వరి కి చెందిన ప్లాటు డెవలప్ మెంట్ చేయలేదనే కారణంతో సుబ్రహ్మణ్యం నుండి ఖాళీ చెక్కు, ప్రామిసరీ నోటును హామీగా తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఇచ్చిన గడువు పూర్తి కాకుండానే వీటిని అడ్డం పెట్టుకుని తనపై కోర్టులో కేసు కూడా వేసినట్లు వెల్లడించారు. ఆమె ఇలా సమకూర్చుకున్న డబ్బు, పలుకు బడితో అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందని, ఇందుకోసం పోలీసులకు కూడా తప్పుడు సమాచారం ఇస్తూ వారిని కూడా తప్పుదోవ పట్టిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కిలాడి లేడికి సహకరిస్తున్న ఓ పోలీస్ అధికారి...**

వాస్తవానికి తాను ఆమెకు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, కానీ తనపై,తన కుటుంబ సభ్యులపై అక్రమంగా క్రిమినల్ కేసులు పెట్టి ఇరికించినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారం లోనే రాజేశ్వరి మీడియేటర్లకు ప్లాట్లు తాలూకా కమిషన్లను ఫోన్ పే ద్వారా చెల్లించడం చేసి వారిని కూడా మోసపూరితంగా కేసుల్లో ఇరికించారని వాపోయారు. ఒక పోలీస్ అధికారి అండదండలతో ఈమె గుంటూరు నగరంలో వరుస హైటెక్ మోసాలకు పాల్పడుతున్నట్లు సుబ్రహ్మణ్యం ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులమని చెబుతూ కొందరు గుర్తుతెలియని వ్యక్తుల ద్వారా తనకు బెదిరింపు కాల్స్ మాట్లాడించి భయాందోళనలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. తాను ఇప్పటికే ఈ కాల్స్ ను రికార్డు చేసి ఎస్పీ, ఐజి, డిజిపి లకు సైతం ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అయితే కారణాలు ఏమైనా తన ఫిర్యాదు పై ఎలాంటి విచారణ జరగడం లేదని, దీంతో ఈమె ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇప్పటికైనా ఈ మాయా లేడి ఆమెకు సహకరిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. తమలాగా వీరి బారిన పడి ఇకపై మరెవ్వరూ మోసపోకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**సాధారణ స్కూల్ టీచర్ కోట్లకు ఎలా ఎదిగిందో రుజువులు చూపెట్టాలి...**

అయితే నంద్యాల రాజేశ్వరి గతంలో ఒక ప్రైవేట్ స్కూల్లో టీచర్ గా పనిచేసేది. ఆమె భర్త వెల్డింగ్ షాపులో పనిచేసేవాడు. మరి వీరు ఏ బిజినెస్ చేసి కోట్లు సంపాదించారు...మరి ఆ బిజినెస్ లు చట్టబద్ధమైనవేనా, వాటి ద్వారా వచ్చిన ఆదాయానికి ఇన్ కంట్యాక్స్ చెల్లింపులు చేశారా?...అనేది విచారిస్తే వీళ్లు కోట్లకు కోట్లు తాము ఇచ్చామంటూ పెడుతున్న అక్రమ కేసుల్లో అసలు బాగోతం బైటపడుతుందని బాధితులు కోరుతున్నారు. అలాగే ఈమెతో పాటు బెదిరింపులక దిగుతున్న చదలవాడ రేణుక భర్త ఒక మాజీ పోలీస్ కానిస్టేబుల్ అని, రూ.90 లక్షలు వాళ్లు ఏ వివరాలు తెలుసుకోకుడా గుడ్డిగా ఎవరికైనా చెల్లిస్తారా?..ఒకవేళ చెల్లించామని అంటుంటే ఆ డబ్బు వారికి ఎక్కడనుంచి వచ్చిందో కనీసం ఆరా తీససినా అసలు నిజానిజాలు అన్నీ బైటపడతాయని చెబుతున్నారు. నంద్యాల రాజేశ్వరి అరాచకాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని బాధితులు చెబుతున్నారు.

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పరికరాలు అందజేసిన వేద సీడ్స్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** ర్యాష్ డ్రైవింగ్ వలన ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో గుంటూరు ఎస్పి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్నటువంటి నియంత్రణా కార్యక్రమాలను వేదా సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా బృందావన్ గార్డెన్స్, ఎన్టీఆర్ స్టేడియం కూడలి సిగ్నెల్స్ వద్ద ట్రాఫిక్ నిబంధనల గురించి 24/7 ఎనౌన్స్మెంట్ చేయటానికి అవసరమైన పరికరాలను ఆయన అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి అతిచేరువైన గుంటూరు ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున నిత్యం అనేక ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని, వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు ట్రాఫిక్ పోలీసు వారి అభ్యర్ధన మేరకు వేదా సీడ్స్ ఈ పరికరాలను అందిచడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేదా సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, ట్రాఫిక్ ఎస్ఐ డి. శ్రీహరి, శంకర్ నాయక్, రంగారావు, తేలప్రోలు వెంకటరావు, గాజులు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# మారక ద్రవ్యాల వినియోగంపై ఉక్కు పాదం మోపండి

(మొదటి పేజీ తరువాయి)

ద్రవ్యాల వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీస్ వారికి పిర్యాదు చేయాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్ధలు తీసుకున్నవారిని గుర్తించేందుకు అవసరమైన కిట్లను కొనుగోలుకు వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సులలోను మాదక ద్రవ్యాలు రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులలో నిషేదిత మత్తు పదార్ధలు రవాణా జరగకుండా రవాణా శాఖ అధికారలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగించటానికి అనువుగా ఉన్న జనసంచారం లేని ప్రాంతాలను మండలాల వారీగా గుర్తించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచి పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. ఇటీవల జిల్లా పోలీసు యంత్రాంగం గంజాయి, ఎండీఎం వంటి మాదక ద్రవ్యాలను అమ్మకాలు చేస్తున్న, వినియోగిస్తున్న వారిని పట్టుకొని, వారి మూలాలను వెలికి తీసి ఎక్కువ మంది ముద్దాయిలపై కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. గతంలో విద్యార్ధులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తే వారి తల్లిదండ్రులు కౌన్సిలింగ్ పిలిచి హెచ్చరించి వదిలివేసేవారమని, వారు తిరిగి మాదక ద్రవ్యాలు వినియోగిస్తుడటంతో ప్రస్తుతం విద్యార్ధులైన మాదక ద్రవ్యాలు వినియోగిస్తు పట్టుబడితే కేసులు నమోదు చేయటం జరగుతుందన్నారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లోను మాదక ద్రవ్యాల వినియోగం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజా వలి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మీ, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా, అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆరినేటర్ విజయ్ ప్రకాష్, బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహబూబ్ షరీఫ్, విభిన్న ప్రతిభావంతులు శాఖ ఏడీ సువార్త, జీజీహెచ్ డ్రగ్ ఎడిక్షన్ సెంటరు ఇన్చార్జి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఆర్ఐఓ జీకే జుబేర్, ఆచార్య నాగర్జున యూనివర్సిటీ ఓఎస్డీ రవికుమార్, ఎస్ ఆర్ ఎం ఏపీ యూనిర్సిటీ స్టూడెంట్ ఎఫైర్స్ డైరక్టర్ రేవతి బాలకృష్ణన్, అమృత యూనివర్సిటీ అడ్మినిస్టేటర్ (ల్యాబరేటరీ) హర్షవర్ధన్, విఐటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు స్కాలర్షిప్‌లు




**గుంటూరు మేజర్ న్యూస్ :**

గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చిట్లూరి రంగవల్లి తాయారమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైశ్య సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి 2000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ ట్రస్ట్ కార్యనిర్వహణా ధికారి ఏ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందించడం జరిగినది. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని నాలుగు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 20 మంది పేద వైశ్య సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఈ స్కాలర్షిప్ అందించటం జరిగిందని, నగరంలోని ఏ పాఠశాలలో విద్యారభ్యసిస్తున్న విద్యార్థులకైనా సహాయం అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఖాసిం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు స్కాలర్షిప్ అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు అందరూ ఆదర్శంగా తీసుకొని నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా చిట్లూరి రంగవల్లి తాయారమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రోస్టర్ విధానాన్ని అమలు చేశాకే గ్రూప్ 2 నిర్వహించాలి

### నిరుద్యోగ ఐక్య వేదిక



**గుంటూరు మేజర్ న్యూస్ :**

2023 డిసెంబర్ 7 న విడుదల చేసిన గ్రూప్ 2 నోటిఫికేషన్ లో రోస్టర్ విధానాన్ని పాటించకుండా మెయిన్స్ కి అభ్యర్థులను ఎంపికచేయటం అన్యాయమని అభ్యర్థులు ఈ విధానంపై తీవ్రనష్టపోతున్నారని గురువారం గుంటూరు నగరం అరండల్ పేట జిల్లా సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రమణ్యం మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ విధానాన్ని నిర్వహించిన తరవాతే మెయిన్స్ నిర్వహించాలని అప్పటివరకు ఈ నెల 23 న జరగనున్న గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షను నిలిపివేయాలని మాట్లాడారు. అదే విధంగా రోస్టర్ విధానం సరిగ్గా పాటించకపోతే పోస్ట్ లు మిగిలిపోయే అవకాశం ఉంది అది అర్హులు కలిగిన అభ్యర్థులకు అన్యాయం చేయటమే అవుతుంది కనుక రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా 92000 పైగా ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసాడు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు వెంకట్, రాజీవ్, నాగరాజు శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మస్తాన్ వలి దర్గాను వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవాలి

### దర్గాను నేరస్తులకు నిలయంగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

### దర్గా పవిత్రతను కాపాడాలి

### జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ సహాయ కార్యదర్శి షేక్ సుభాని



**గుంటూరు మేజర్ న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సంబంధించినటువంటి గుంటూరు నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన హజరత్ కాలే మస్తాన్ వలి దర్గా పవిత్రతను భంగం కలిగించడమే కాకుండా, రావి రామ్మోహనరావు, అతని కుమారుడు మస్తాన్ సాయి దర్గాను వ్యాపార కేంద్రంగా మార్చారని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు, మాజీ గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డ్ జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా లు దుయ్యబట్టారు. గురువారం గుంటూరు నగరంపాలెంలోని ముస్లిం సేన రాష్ట్ర కార్యాలయంలో వారు మాట్లాడుతూ రావి రామ్మోహనరావు కుటుంబానికి ఈ దర్గాకు సంబంధం లేదని కోర్టు స్పష్టం చేసినా, గత వక్ఫ్ బోర్డులో ఇతనిపై చర్యలు తీసుకోవాలని షో కాజ్ నోటీస్ ఇచ్చి డైరెక్ట్ మేనేజ్మెంట్ లోనికి తీసుకోవాలని వక్ఫ్ బోర్డు నిర్ణయించినప్పటికీ వక్ఫ్ బోర్డు సీఈఓ పై గత ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్ల మేరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికార ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు అధికారుల దృష్టి సారించింది మస్తాన్వలి దర్గాను వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవాలి కోరారు. ఇప్పటికే మస్తాన్ సాయి డ్రగ్స్ సరఫరా చేయడమే కాకుండా, పలువురు యువకులను, మహిళలను డ్రగ్స్ బానిసలుగా చేసి పలువురు మహిళలపై లైంగిక వేధింపుల కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. పోలీసులు గతంలో మస్తాన్ వలి దర్గాలో రావి రామ్మోహన్ రావు కుమారుడు మస్తాన్ సాయిని దర్గాలో దాచి పెట్టడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అరెస్ట్ చేయడం వలన పలు పత్రికలు, చానల్లో కథనాలు వచ్చాయని గుర్తు చేసారు. నేర కార్యకలాపాలకు వేదికగా నిలిచిన దర్గా అపవిత్రతకు గురి కావడం వల్ల బాబా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉన్న బాజీ బాబా దర్గా లో కేవలం తాయత్తు రూ.50 , ద్విచక్ర వాహన పూజకి 200 రూపాయలు ఒడగా మస్తాన్ వలీ బాబా దర్గాలో రావి రామ్మోహన్ రావు తాయత్తు రూ.500, ద్విచక్ర వాహన పూజకు రూ.800 వసూలు చేస్తూ భక్తులను నిలువ దోపిడీ చేస్తూ వ్యాపార కేంద్రంగా మార్చారు . త్వరలో మస్తాన్ వలీ బాబా భక్తుల్లో ఉన్న అన్ని వర్గాల వ్యక్తులను కలుపుకొని మస్తాన్ వలి బాబా పరిరక్షణ కమిటీగా ఏర్పడి పలువురు అధికారులకు, నాయకులకు ఫిర్యాదు చేసి మస్తాన్వలి బాబా పవిత్రతను కాపాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, మైనార్టీ నాయకుడు సైదా, సత్య పలువురు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటర్లకు అవగాహన సదస్సు

**దుగ్గిరాల ,మేజర్ న్యూస్**

దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల నందు గురువారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ ఏ. లక్ష్మీ కుమారి, కళాశాల ప్రిన్సిపాల్ కొత్త గిరిధర్ రావు తాసిల్దార్ సునీత, నోడల్ అధికారి కే.సంజీవరావు, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.రమాదేవి, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావులు హాజరయ్యారు తాసిల్దార్ కార్యాలయం నుండి అధికారులు ర్యాలీగా శివాలయం సెంటర్ వరకు వెళ్లి మానవహారం నిర్వహించారు .అనంతరం కళాశాలకు చేరుకొని ఓటర్లుచే ప్రతిజ్ఞ చేయించి అవగాహన




కల్పించారు. ఈ ర్యాలీలో వివిధ రకాల ప్లే కార్డు లు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల తాసిల్దార్ సునీత, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఆర్ఐ త్రివేణి ఎస్సై ఎస్ .వెంకట రవి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు..

## షాపింగ్ కాంప్లెక్స్ ల్లో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాప్‌లను సీజీ చేయాలి

### రెవెన్యూ అధికారులకు నగర కమిషనర్ ఆదేశాలు

**గుంటూరు నగర పాలక సంస్థ,మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్ ల్లో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాప్ లను సీజీ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. గురువారం కమీషనర్ స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్ లోని షాప్ లను పరిశీలించి, సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ



నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ల్లో అద్దెకు తీసుకొని, సుధీర్ఘకాలం నుండి అద్దెలు చెల్లించని వాటిని తక్షణం సీజ్ చేయాలని, ఎన్టీఅర్ స్టేడియం కాంప్లెక్స్ లోని 5, 6 షాప్ లను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారి మదన్ గోపాల్ ని ఆదేశించారు.

అలాగే కాంప్లెక్స్ లో మొత్తం షాప్ లు, అద్దె బకాయి ఉన్న షాప్ లు, ఖాళీగా ఉన్న షాప్ ల వివరాలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కాంప్లెక్స్ ల వివరాలను సమగ్ర నివేదిక రూపంలో అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఖాళీ షాప్ లకు ఆక్షన్ వేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో రెవెన్యూ అధికారి మదన్ గోపాల్, డి.ఈ.ఈ రమేష్ బాబు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నేటి సమస్యల పరిష్కారానికి గాంధీయే మార్గం

**- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్**

**గుంటూరు మేజర్ న్యూస్ :**

నేడు భారతదేశంలో ఎదుర్కొంటున్న సమస్యలకు గాంధీయే మార్గం అని ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో అమరావతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, జనచైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో గాంధీయే మార్గం పుస్తకావిష్కరణ సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ ప్రసంగిస్తూ ప్రపంచానికి అహింస ఆయుధాన్ని అందించిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని కొనియాడారు. ప్రపంచంలో గుర్తింపు పొందిన లెనిన్, ఐన్ స్టీన్, మార్టిన్ లూథర్, వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి మహనీయులు గాంధీయిజం సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలిపినట్లు గుర్తు చేశారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గాంధీయిజాన్ని ఆచరించకపోతే వీర రాఘవరెడ్డి లాంటి వాళ్లు పెరుగుతారని, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టవద్దని, ప్రజల ఐక్యతే సమాజానికి మేలు చేస్తుందని వంద సంవత్సరాల క్రితమే మహాత్మా గాంధీజీ ఉద్భోదించారన్నారు. నేడు గాడ్సే వాదులు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ముస్లింల పట్ల వ్యతిరేకతను పెంచుతూ రాజకీయ లబ్ధి కోసం గాంధీజీ పట్ల ద్వేష భావాన్ని ప్రజలలో పెంచుతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే




మహిళలు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల పట్ల విద్వేష భావాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. మనిషిని కుల, మతాల పేరుతో ద్వేషించడం ప్రారంభిస్తే సమాజం ధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నేడు మతోన్మాద శక్తులు గాంధీజీ, నెహ్రూల పట్ల ద్వేష భావం పెంపొందిస్తున్నారని, సోషల్ మీడియా, వాట్సాప్ యూనివర్సిటీల ద్వారా విద్వేష ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీయే మార్గం పుస్తకాన్ని ఆచార్య నాగార్జున విద్యాలయ విశ్రాంత రిజిస్టర్ రావెల సాంబశివరావు సభికులకు పరిచయం చేసి వ్యాస సంకలనాల రచయితల మనోభావాలను చక్కగా వివరించారు. ప్రముఖ విద్యావేత్త ప్రొ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గాడ్సే వాదులు గాంధీజీ హిందూ వ్యతిరేకి అని, ముస్లింల జాతిపిత అని విష ప్రచారం చేస్తున్నారని, గాంధీజీ భావాల ఫలితంగానే భారతదేశం నేడు ఐక్యంగా ఉండగలుగుతుందని తెలిపారు. గాంధీయే మార్గం అనే నినాదం నేడు ఆచరణ యోగ్యంగా ఉందన్నారు. గాంధీయే మార్గం సిద్ధాంతాలు-ప్రభావాలు- పరిష్కారాలు అనే 4వ సంపుటిని మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని స్వీకరించిన విశ్రాంత తెలుగు ఆచార్యులు వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ సంకుచిత జాతీయ వాదానికి ప్రతీక గాడ్సే అని వివరించారు. బుద్ధుని అనంతరం ప్రపంచానికి సత్యం, అహింస, రాజకీయ విశ్వసనీయత లాంటి విలువలను ప్రపంచానికి అందించిన మహా మనీషి మహాత్మా గాంధీజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, సెర్ఫ్ ఎన్.జి.వో అధ్యక్షులు హనుమ ప్రసాద్, మాదిగ జనసేవా సమితి నేతలు దాసరి జాన్ బాబు, పరంగి సత్యరాజు, కందుల ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘ నేత తాడికొండ నరసింహారావు, ప్రముఖ సాహితీ పరిశోధకులు పారా అశోక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# రోస్టర్ లోపాలు సరిదిద్ది గ్రూప్-2 పరీక్ష నిర్వహించాలి



**గుంటూరు, రూరల్ మెసేజ్,న్యూస్:**

రోస్టర్‌లోని లోపాలు సరిదిద్ది గ్రూప్ – 2 పరీక్ష నిర్వహించాలని గంగోలుశామ్యూల్ MLC అభ్యర్థి డిమాండ్ చేశారు. ఈ రోజు అరండల్ పేట ,గుంటూరు లోని జిల్లా గ్రంథాలయం వద్ద గ్రూప్ 2 ఉద్యోగార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం,రోస్టర్ లోని లోపాలు సరిదిద్ది, తర్వాతనే పరీక్ష నిర్వహించాలని ఆయన కోరారు. ప్రభుత్వాలు ఇచ్చిన మాటకు,చట్టానికి కట్టుబడి పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువకుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చిత్త శుద్ధితో పని చేయాలని శామ్యూల్ కోరారు. తనకు నేటి కృష్ణా – గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం MLC ఎన్నికలలో 1వ.ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపిస్తే, చట్ట సభలో ప్రతి పౌరుని హక్కులకోసం పోరాడతానని ఆయన విజ్ఞాపన చేశారు

# గంజాయి విక్రేతల అరెస్ట్



**తెనాలి, మేజర్ న్యూస్**

పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నాలుగు కేజీలకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి డీఎస్పీ బి జనార్ధనరావు తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. పట్టణంలోని వైకుంఠపురం రైల్వే బ్రిడ్జ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిలో ఒక మైనర్ యువకుడు ఉన్నట్లు చెప్పారు. వారి వద్ద నుండి 4.50 కేజీల గంజాయితో పాటు రూ. 4500 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి విక్రయించిన, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసిన వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని ఆయన అభినందించారు.

# రమావత్ హైమా నాయక్ కుటుంబానికి చీఫ్ విప్ జీవీ పరామర్శ

**బొల్లాపల్లి మేజర్ న్యూస్**

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి మృతి చెందిన రైతు రమావత్ హైమా నాయక్(45) కుటుంబాన్ని గురువారం పరామర్శించారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. అన్నివిధాలుగా అండగా ఉంటాము, అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం హనుమాపురం గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో రమావత్ హైమా



నాయక్ ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనతో దిక్కుతోచనిస్థితిలో పడిన రైతు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు చీఫ్ విప్ జీవీ. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో హైమా నాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. అవకాశం ఉన్న మేరకు అన్ని మార్గాల్లో వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

# ఎస్ఆర్ఎంలో నూతన బీ.కామ్ కోర్సులు ప్రారంభం

**మంగళగిరి మేజర్ న్యూస్:**

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మేనేజ్ మెంట్ కోర్సులను విస్తృత పరుస్తోంది. ఇందులో భాగంగా గురువారం రెండు కొత్త బీ.కామ్ కోర్సులను ప్రారంభించింది. సీపీ ఇంటిగ్రేటెడ్ బీకామ్ తో పాటు ఫిన్‌టెక్ అండ్ బ్యాంకింగ్ సబ్జెక్టులతో కూడిన రెండు బీ.కామ్ స్పెషలైజేషన్లను ప్రారంభించింది. గురువారం నుంచి యూనివర్సిటీలో 'అమేయ' పేరిట రెండు రోజుల పాటు బిజినెస్ ఫెస్ట్ జరుగుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలోని పారి బిజినెస్ స్కూల్ నూతన బీ.కామ్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. తాత్విక్ గ్లోబల్ ఎనలికల్ సంస్థ సీఈవో రుపేబీర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కోర్సుల ప్రారంభ సభలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్



ఆరోరా యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన బార్ క్లేస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బాల అయ్యర్, ఐసీఐసీఐ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ప్రెసిడెంట్ సీపీ రవికిషోర్లు ప్రసంగించారు. సరికొత్త పాఠ్య ప్రణాళికతో నూతన బిజినెస్ కోర్సులను ప్రారంభించిన ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని ప్రశంసించారు. 2025 విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని పారి బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ శివకుమారన్ పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులనీ, ఆసక్తి గల విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వెబ్ సైట్లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. సీపీ చదవాలనుకునే విద్యార్థులకు సీపీ ఇంటిగ్రేటెడ్ బీ.కామ్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందనీ, అదేవిధంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగాల్లో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఫిన్‌టెక్ అండ్ బ్యాంకింగ్ బీ.కామ్ మంచిదని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఏ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యం అతిథులను సత్కరించింది.

## నేడు జీఎంసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్




**గుంటూరు నగరపాలక సంస్థ మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు ఈ నెల 21న (శుక్రవారం) సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల వారీగా కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు తమ సర్వీసు కు సంబందించిన సమస్యలు, కార్మికులు ప్రధానంగా పిఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్ లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉక్కు మహిళ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా

**బీజేపీ మహిళా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్**



**గుంటూరు మేజర్ న్యూస్ :**

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖ గుప్తాకి శుభాకాంక్షలు తెలియచేసుకుంటూ బీజేపీ గుంటూరు జిల్లా మహిళా మోర్చా నాయకులు బీజేపీ పార్టీ ఆఫీస్ వాజేపేయి భవన్ లో సంబరాలు చేసుకోవటం జరిగింది. ఒకరికిఒకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంతోషం వ్యక్తపరచటం జరిగింది. బీజేపీ మహిళా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ రేఖ గుప్తా విద్యార్థి దశలోనే ఏబీవీపీలో సేవ లందిస్తూ బీజేపీ నాయకురాలిగా జాతీయ స్థాయిలో అనేక పదవులు చేస్తూ కార్పొరేటరగా, మేయర్ గా, మొదటిసారి ఎమ్మెల్యే గా గెలుపొంది గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి కైవసం చేసుకున్నందుకు సంతోషం గా ఉందని, బీజేపీ అంటేనే మహిళలకి సముచిత స్థానం కల్పించటంలో ప్రధాన పాత్ర కలిపిస్తుందని, దేశం మొదటి పౌరురాలిగా ద్రౌపది ముర్మూగారిని, దేశ ఆర్థిక మంత్రిగా నిర్మల సీతారామన్ని అలాగే గురువారం ఢిల్లీ సీఎం గా రేఖ గుప్తాని నియమించినందుకు మన ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ జిల్లా కార్యదర్శి ఏలూరి లక్ష్మి మహిళా మోర్చా ఉపాధ్యక్షులు సాధువాణి, వాణి వెంకట్ ,మోర్చా కోశాధికారి డి ఆర్. స్రవంతి,రేణుక, నీలిమ, సరోజినీ,రమాదేవి పాల్గొన్నారు

## ఆలపాటి గెలుపు కోసం ప్రచారం

**సత్తెనపల్లి,మేజర్ న్యూస్:**

కృష్ణా గుంటూరు జిల్లాల తెలుగుదేశం పార్టీ కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తు సత్తెనపల్లి మునిసిపాలిటి 24 వార్డ్ పరిధిలో పార్టీ సినియర్ నాయకులు జింకా లోకేశ్వరరావు, ఫనిదరపు నరసింహారావు జింకా రామారావులు ప్రచారం చేశారు.రాజేంద్రప్రసాద్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని, మంత్రిగా పనిచేశారని, ఆయనను శాసనమండలికి పంపిస్తే సమస్యల పరిష్కారానికి పని చేస్తారని తెలిపారు.ఓటర్లను కలసి ఆలపాటికి ఓటేయాలని అభ్యర్థించారు.



## ప్రయివేట్ ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్వాడి కేంద్రాలు : డీఈఓ సివి రేణుక

**గుంటూరు మేజర్ న్యూస్ :**



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా చౌత్రా సెంటర్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగు తున్న శిక్షణ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సి. వి. రేణుక సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్లే స్కూలుకు ధీటుగా అంగన్వాడి కేంద్రాలు నిర్వహించాలని, తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యే విద్యార్థుల పునాది బలంగా ఉంటుందని అన్నారు. కాబట్టి ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన విద్యా విధానాలను ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు బోధించాలని, ప్రభుత్వం ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి ఇటు వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కోర్స్ డైరెక్టర్ అబ్దుల్ ఖుదూస్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటి ద్వారా తమ భోదనా నైపుణ్యాలు పెంచుకోవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఖాసీం, రిసోర్స్ పర్సన్స్ బి. జ్యోతి, శైలజ, అనురాధ, రమా దేవి తదితరులు పాల్గొన్నారు.

## 10లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి

**ఎంఈఓ ఖుద్దూస్ ఆలోచనలు బాగున్నాయి : డిఇఓ సివి రేణుక**

**గుంటూరు మేజర్ న్యూస్ :**



గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థికి పదో తరగతి విద్య ఎంతో కీలకమని, పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా అనేక ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు కాబట్టి పదో తరగతి పరీక్షలకు శ్రద్ధగా సన్నద్ధం కావాలని అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థినులకు మండల విద్యాశాఖాధికారి ఎస్.ఎం.ఎం ఖుద్దూస్ సహకారంతో ఒక్కొక్కరికి 500 చొప్పున ముగ్గురు విద్యార్థులకు అందించారు. మండల విద్యాశాఖాధికారి ఖుద్దూస్ మాట్లాడుతూ కష్టపడి చదివి, మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరును సాధించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఖాసీం మాట్లాడుతూ నగదు ప్రోత్సాహకము ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించిన మండల విద్యాశాఖాధికారి, మంచి సూచనలు ఇచ్చిన జిల్లా విద్యాశాఖాధికారి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## న్యాయవాదుల నిరసన



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్:**

న్యాయవాద చట్టం(1960) సవరణ చేసి 2025లో నూతన బిల్లును ప్రవేశపెట్టాలనే కేంద్రం చర్యను పూర్తిగా వ్యతిరేకిస్తు సత్తెనపల్లిలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి తీవ్ర నిరశనను తెలియజేశారు. గురువారం ఉదయం గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ బహిష్కరణ రేపు అనగా 21వ తేదీ శుక్రవారం కూడా విధులు బహిష్కరణ చేస్తామన్నారు. న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసబాబు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ...



**పిడుగురాళ్ళ,మేజర్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతిని పిడుగురాళ్ల పట్టణ బిజెపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కేతావత్తు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ పరిపాలన విధానంలో, యుద్ధ తంత్రాలలో, భారతదేశ రాజులలో శివాజీ మహారాజ్ అగ్ర గన్యుడని, గూడచారి వ్యవస్థను ఏర్పాటు చేసుకొని శత్రువుల యొక్క వ్యూహాలను కనుగొనటంలో దిట్ట అన్నారు. అన్ని మతాలను గౌరవించిన నాయకుడు అన్నారు. గురజాలకో కన్వీనర్ వద్దమూడి వెంకయ్య మాట్లాడుతూ పూణే రాజధానిగా మరాఠా సామ్రాజ్యాన్ని దేశ వ్యాప్తంగా నిలబెట్టిన మహాయోధుడు శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు, పట్టణ జనరల్ సెక్రెటరీ మణికంఠ, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఉడుత ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ విద్రోహశక్తులకు అడ్డాగా మారిన దాచేపల్లి

**- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ**

**గుంటూరు మేజర్ న్యూస్ :**



హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ 395వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న వేడుకల నేపథ్యంలో బుధవారం (19 ఫిబ్రవరి 25) నాడు పల్నాడు జిల్లాలోని దాచేపల్లి గ్రామంలో జరిగిన ఛత్రపతి శివాజీ శోభాయాత్ర పై కొంతమంది "దేశద్రోహులు" దేశద్రోహి అయినటువంటి టిప్పు సుల్తాన్, పాకిస్తాన్ జెండాలను చూపిస్తూ భారతదేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, హిందూ సమాజం పట్ల ద్వేషాన్ని ప్రకటిస్తూ, సదరు "శివాజీ శోభా యాత్ర" పై రాళ్లు రువ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను.హైందవ సోదరులు "శాంతియుతంగా" జరుపుకుంటున్న "శోభాయాత్ర"పై "దాడులు" చేసి "మతపరమైన విద్వేషాల"ను రెచ్చగొట్టి,తద్వారా భారతదేశంలో మారణ హోమాన్ని సృష్టించాలని చూస్తున్న హిందూ వ్యతిరేక దుండగులు పై "దేశద్రోహం" నేరం క్రింద కేసులు నమోదు చేసి "దేశ బహిష్కరణ" చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

## నకరికల్లు గ్రామ పంచాయతీ ప్రజారోగ్య సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లకు సామాగ్రిని అందజేత

**మేజర్ న్యూస్ నకరికల్లు**

గురువారం నకరికల్లు లోనీ ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డు వద్ద పంపిణీ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ , పంచాయతీ కార్యదర్శి కెవి శివ ప్రసాద్ పాల్గొన్నారు.. జిల్లా గ్రామపంచాయతీ అధికారి విజయభాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎంపీడీవో కాశయ్య సూచనలు అనుసరించి ప్రజారోగ్య సిబ్బందికి ప్రజారోగ్య వస్తువులను ప్రతి రోజు వినియోగించు కొనే నిమిత్తం పంపిణీ చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు..



# పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షుడుగా కేతావతు శ్రీనివాస్ నాయక్ నియామకం..

పిడుగురాళ్ల మేజర్ న్యూస్



పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షునిగా కేతవత్ శీను నాయక్‌ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.. ఈరోజు నన్ను ఎన్నుకోవటానికి సహకరించిన బిజెపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరు శశి కుమార్, పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు, పల్నాడు పార్లమెంట్ ఇన్ చార్జి కొక్కెర శ్రీనివాస యాదవ్ , ఒంగోలు జిల్లా ఇన్ చార్జి పొనగల్ల రవిశంకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతనబోయిన హనుమంతరావు, గురజాల నియోజకవర్గ కన్వీనర్ ఆరే వెంకటేశ్వర్లు, గురజాల నియోజకవర్గ కో కన్వీనర్ వడ్లమూడి వెంకయ్య, పిడుగురాళ్ల మాజీ అధ్యక్షుడు కట్టమూరు ఉమామహేశ్వరరావు (ఈశ), పిడుగురాళ్ల మాజీ అధ్యక్షుడు ఆతుకూరి కాశీ విశ్వనాథం, పల్నాడు జిల్లా ఎస్టి మోర్చా అధ్యక్షుడు చల్లంచర్ల విజయకుమార్, పిడుగురాళ్ల పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి అత్తులూరి రాము (ఆడిటర్) మరియు పెద్దలందరికీ ధన్యవాదములు తెలిపారు.

## తప్పు చేసిన వారిని దండించమని రాజ్యాంగం పోలీసులకి హక్కు కల్పించింది

## దానిని వాళ్ళు తప్పుదారులో వాడుకుంటున్నారు

నకరికల్లు మేజర్ న్యూస్



నకరికల్లు గ్రామంలో పోలీస్ స్టేషన్ రోడ్ లో నరసరావుపేట నుంచి వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న కానిస్టేబుల్ టు వీలర్ బైక్కి ఆటో సైడ్ కొంచెం రాసుకుందని ఆటో డ్రైవర్ చెప్పడం జరిగింది. నకరికల్లు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్నటువంటి కానిస్టేబుల్ నా బండి నే గుద్దుతావా అని ఆటో డ్రైవర్ ని తన ఇష్టానుసారంగా కొడుతుంటే ఆటో డ్రైవర్ ఎదురు జనం ఉన్నందువలన కొద్దిగా సైడ్ కి అన్నాను సార్ అని చెప్తున్న వదలకుండా కొడుతుంటే సార్ నీ కాళ్లు పట్టుకుంటాను వదిలేయండి సార్ అని ప్రతిమలాడిన వదలలేదు. అక్కడున్న జనమంతా వచ్చి కానిస్టేబుల్ ని అడ్డు తీస్తుంటే అయినా కొడుతున్నాడు. అక్కడ ఉన్న జనం కానిస్టేబుల్ కి సర్ది చెప్పి ఆటో అతన్ని పంపించారు..అంతటితో ఆగని కానిస్టేబుల్ ఆటో అతన్ని వదలకుండా ఆటోని ఫాలో అయ్యి కొంత దూరం ఆటో వెళ్లాక ఆపి అతన్ని మళ్లీ కొట్టాడు అని సమాచారం. అదేవిధంగా నకరికల్లు స్టేషన్లో కొంతమంది కానిస్టేబుల్ దుడుకు ఎక్కువైందని స్థానికులు అంటున్నారు ప్రజలతో కలిసిపోయి స్నేహపూర్వకంగా కలిసిమెలిసి మర్యాదపూర్వకంగా ఉండాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రకటనలు చేస్తుంటే కొంతమంది కానిస్టేబుల్ మర్యాద లేకుండా ప్రజలను నోటికి ఇష్టానుసారంగా మాట్లాడుతూ వారిని ఆవేదనకు గురి చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఒక కానిస్టేబుల్ కి ఒక పత్రిక రిపోర్టర్ కి మధ్య వాగ్వాదం కూడా జరిగింది. అలాంటి వారి పైన కూడా చర్యలు తీసుకోకపోతే పోలీసులు మీద ఉన్న గౌరవం పోతుందని స్థానికులు అంటున్నారు.రాత్రి సమయాలలో గస్తీ నిర్వహించే కొంతమంది సిబ్బంది వారికి నచ్చినట్లుగా ఇస్తూ,చేస్తూ ఉంటే ఏమీ లేదు. లేకపోతే వారి నోటికి పనిచెపుతూ ప్రజలను భయపెడుతున్నారు. ఇలాంటి పోలీసుల మీద ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నారు.

# ఆలపాటికి మద్దతుగా యాగంటి

మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్:

ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపుకు మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. మాచర్ల నియోజకవర్గం లోని అన్ని రంగాల వారిని ఓట్లు అభ్యర్థిస్తూ తమ అమూల్యమైన ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు వేయాలని పట్టబద్దుల ఓటర్లను కోరుతున్నారు. ఇందులో భాగంగా గురువారం మాచర్ల పట్టణంలోని జర్నలిస్టులను, డాక్టర్లను,మెడికల్ షాపుల నిర్వాహకులను,కెసిపి ఉద్యోగులను కలిసి కరపత్రాల ద్వారా ఓట్లు అడుగుతున్నారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే మాచర్ల నియోజకవర్గ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామ మూర్తి కార్యాలయానికి చేరుకొని అక్కడ జర్నలిస్టులను తమ ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు వేయాలని కోరారు.తెలుగువారిని అగ్రస్థానంలో నిలపటమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో రూ.850 కోట్లతో గుంతల పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి,రూ 4500 కోట్లతో



గ్రామాలలో సిసి రోడ్లను, మౌలిక వసతులను కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.పట్టభద్రుల ప్రగతి కోసం ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు ఒకటో నెంబర్ పై ఓటు వేసి ఆయనను గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులకు కరపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తిక్కా కొండలు యాదవ్, వంగేపరపు కోటేశ్వరరావు, దుర్భాకుల ప్రసాదు,మాచర్ల ఏసోబు, ఎస్టీ సంఘ నాయకులు దేవరశెట్టి బ్రహ్మం, జర్నలిస్టులు మాగులూరి రాంబాబు, పఠాన్ జాన్ ఖాన్,పాగళ్ళ పూర్ణచంద్ర రావు, బొట్ల శ్రీనివాసరావు,ఎల్ సంతోష్, బుచ్చిబాబు,ముక్కంటి,చంద్రశేఖర్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## తొలి ప్రాధాన్య ఓట్లన్నీ ఆలపాటికే పడేలా కృషి చేయాలి: చీఫ్ విప్ జీవీ

వినుకొండ మేజర్ న్యూస్

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా చీఫ్ విప్ జీవీ ప్రచారం ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో తొలి ప్రాధాన్య ఓట్లన్నీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కే పడేలా కృషి చేయాలని అందరికీ విజ్ఞప్తి చేశారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. పట్టభద్రులు ఓటు వేసే సమయంలో... పీడీఎఫ్ అభ్యర్థిగా నిలిచిన లక్ష్మణరావు వెనక ఉన్నది ఎవరో గ్రహించి నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. వైకాపా ముసుగు రాజకీయాల్ని ఛేధించాల్సిన సమయం వచ్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారానే అది నిరూపించాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ మేరకు కృష్ణా - గుంటూరు పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి కోరుతూ గురువారం చీఫ్ విప్ జీవీ విస్తృత ప్రచారం చేశారు. వినుకొండ పట్టణంతో పాటు నూజెండ్ల, బొల్లాపల్లి, ఈపూరు మండల కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి ఆలపాటికి ఓటు వేయాలని అభ్యర్థిం చారు. పట్టభద్రులు, ఉద్యోగు లను ఆత్మీ



యంగా పలకరించి కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

అనంతరం ఆయమ మీడియాతో మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఉద్యోగు లంతా కూటమి వైపు సానుకూలంగా ఉండడం శుభపరి ణామం అన్నారు. ఈ కార్యక్రమంలో లగడపాటి వెంకట్రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, గంగినేని అంజయ్య, భూపతి రావు, గంగినేని రాఘవ, ముంద్రు సుబ్బారావు, బచ్చు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వెల్లటూరు వెళ్ళు రోడ్డు నందు జనసేన ఆత్మీయ సమ్మేళనం

వినుకొండ మేజర్ న్యూస్

వినుకొండ పట్టణం వెల్లటూరు రోడ్డులో గల జనసేన పార్టీ కార్యాలయం నందు గ్రాడ్యుయేట్ MLC కూటమి అభ్యర్థి మద్దతుగా జనసేన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు జనార్ధన్ జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్ తదితరులు పాల్గొన్నారు




# తెదేపాలో దళితులకు దక్కని సముచిత స్థానం

**కష్టపడి పని చేసినా నియామక పదవుల్లో రిక్తహస్తం**

**ఎన్నిసార్లు విన్నవించినా స్పందించాలి శాసనసభ్యులు కన్నా.**

**నియోజకవర్గం యస్ సి సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా బొక్క సంగీత రావు.**

సత్తెనపల్లి రూరల్, మేజర్ న్యూస్ :

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి నేటికి దళిత జాతికి నియోజకవర్గ పరిధిలో సముచిత స్థానం లేదని, నియామక పదవుల్లో న్యాయం జరగటంలేదని అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, న్యాయవాది బొక్క సంగీతరావు తెలిపారు. గురువారం ఆయనకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరియా ఆసుపత్రి కమిటీ లో నూ,నియోజకవర్గ నామినెటె పదవులు లలో దళితులకి స్థానం లేదని అందరూ ప్రశ్నిస్తున్నారని వివరించారు. నామినేటెడె పదవులు గురించి టీడీపీ యస్సి విభాగం నాయకులు అందరూ



అడిగితే సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రావాలని రాత్రి, పగలనక దళితులు ఎంతో కష్టపడి పనిచేసామని, అయినా సరైన గుర్తింపు,,రాజకీయ ప్రాధాన్యం, కీలక పదవుల్లో దళితులకు అవకాశాలు కల్పించడం లేదనేది వాస్తవమన్నారు.

ఇదే విషయం పై స్థానిక శాసనసభ్యుల వారిని చాలా సార్లు అడిగినా, పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా సామాజిక వర్గంలో కష్టపడి పనిచేసిన వారికి న్యాయం చేయలేనప్పుడు ఎందుకు ఈ పదవి అని నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని బొక్క సంగీత రావు తెలిపారు.

# కూటమి అభ్యర్థి ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

**గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరిన మన్నవ**



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** రానున్న ఉమ్మడి కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నరసరావుపేటలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ ఇంచార్జిలు, బూత్ వాలంటీర్స్ , కూటమి ముఖ్య నాయకుల సమావేశంలో పల్నాడు జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ , నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ , నరసరావుపేట పరిశీలకుడు మన్నవ మోహన కృష్ణ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా జనసేన, బిజెపి కూటమి నేతలు పాల్గొన్నారు.



# రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించండి

- వాహనాల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలోని రహదారులపై ప్రమాదానికి కారణం అవుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి వాహనాల ప్రమాదాలు జరగకుండా అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశిచారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులతో కలసి జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయితీ, మున్సిపల్ అధికారులతో రవాణా, పోలీస్ అధికారులు సంయుక్తంగా రహదారులను తనిఖీ చేసి బ్లాక్ స్పాట్ లపై 15 రోజుల్లో నివేదిక అందించాలన్నారు. తనిఖీలలో గుర్తించిన అంశాల మేరకు బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో రహదారుల విస్తరణ, మరమ్మత్తు, సైన్ బోర్డు, వేగ నియంత్రణ తదితర చర్యలు సంబంధిత రహదారుల ఇంజనీరింగ్ అధికారులు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోనే ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించేలా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో గుంతల రహిత రహదారుల కోసం ఆర్ అండ్ బీ, మున్సిపల్ రహదారులకు మంజూరు చేసిన పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ రద్దీ



నివారణ, రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ సూచించిన విధంగా ముఖ్య కూడళు ళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, జీబ్రా లైన్ల మార్కింగ్, వేగ నియంత్రికల పనులు మున్సిపల్ అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల పక్కన వ్యర్థాలు వేయకుండా సంబంధిత స్థానిక సంస్థల అధికారలు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థతో పాటు జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు చెత్తను తరలించే ఇతర మున్సిపాల్టీల వాహనాలు పూర్తిగా వ్యర్థాలు రహదారిపై పడకుండా పట్టాతో కవర్ చేసి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి మన రాష్ట్రం వారికే కాకుండా ఇతర రాష్ట్రాల వాహన డ్రైవర్లకు డా. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు వైద్యశాలలో ఉచితంగా వైద్యం అందిస్తున్నందున , ప్రమాదాలు జరిగన సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులకు బాధితులను తరలించేలా అంబులెన్స్ డ్రైవర్లకు సూచనలు చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. వ్యాపార సంస్థల సెల్లార్లలోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ వద్ద నూతన బ్రిడ్జ్ నిర్మాణ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపు కోసం పోలీస్ శాఖ ప్రతిపాదించిన రహదారుల విస్తరణ, మరమ్మత్తులు పనులను మున్సిపల్ అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా అధికారులు నిరంతరం తనిఖీ చేస్తు పర్యవేక్షించాలని, వాహనం నడుపుతూ డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లడరాదని స్పష్టంగా ఆదేశించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రహదారి భద్రత నిబంధనలు వాహనదారులు పాటించాలని ట్రాఫిక్ సిగ్నల్ కూడళ్ళ వద్ద పబ్లిక్ అనౌన్స్ సిస్టం ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మార్చి 1వ తేది నుంచి రూ.1000 జరిమాన విధించటం జరుగుతుందని, దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ ఈ శ్రీనివాస మూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, పంచాయితీ రాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య, డీఎంహెచ్ఓ విజయలక్ష్మీ, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ అరుణ కుమారి, ఆర్టీఓలు సత్యన్నారయణ ప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో
సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది,
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో
"నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని
నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో
ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను.
ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి
ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం,
5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను,
8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్,
11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి,
13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

**పి. బాలు ( చిన కొండయ్య)**
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.



## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. నరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | | | |
|---|---|---|---|
| పి. బాలు (చిన కొండయ్య) బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987 | వి.వెంకటరెడ్డి బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991 | |
| ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466 | జి.హిరన్మాయి(కన్నల్) నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్ | చెట్టిపోగు కాశి దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327 | |
| శేషగిరి రాజు మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201 | వై.ఏసుబాబు గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు సత్తెనపల్లి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9866246951 | చెవుల రంగారావు మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635 |
| యం.కృష్ణ మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149 | వి.రవికుమార్ తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200 | డి. చైతన్య వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453 | వి.లూథర్ నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078 |
| జి.ఏలియా ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959 | బి.సాంబశివరావు రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676 | రమేష్ దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840 |
| కె.నాగరాజు రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000 | డి.రమేష్ ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్ శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987 | బి.గురవయ్య వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426 | వి.లక్ష్మీనారాయణ రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075 | పి.వెంకటేశ్వర్లు దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్ వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723 | పి.మణికంఠ మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885 | ఎస్.డి.మహబూబ్ మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898 | ఎం.కోటేశ్వరరావు మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169 |
| డి.మల్లికార్జునరావు యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441 | రమేష్ క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828 | ఎస్.విజయభాస్కర్ గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538 | షేక్ నాగూర్ నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300 |
| పి.ఆనంద్ వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239 | నాగరాజు మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913 | రమేష్ నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600 | "నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు. |

# మాజీ సీఎం జగన్ పై కేసు నమోదు

## నల్లపాడు సిఐ వంశీధర్

**గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్ :**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి గుంటూరులోని చిలకలూరిపేట రోడ్డులోని మిర్చి యార్డుకు బుధవారం మంది మార్బలం తో వాహన చోదకులను, అలాగే ట్రాఫిక్ కు, లా అండ్ ఆర్డర్ కు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తో పాటు మరికొందరిపై పోలీసు కేసు నమోదు చేసినట్లు నల్లపాడు సిఐ వంశీధర్ గురువారం విలేకరులతో తెలిపారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అయన సిబ్బందితో పాటు, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి రోడ్డు రవాణా వ్యవస్థను బుధవారం స్తంభింప చేశారన్నారు. ఇందుకు గాను వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తో పాటు మరో తొమ్మిది మంది వైసిపి కీలక నేతలపై గుంటూరు నల్లపాడు పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లేదా రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా రాజకీయ నాయకులు పర్యటనలు జరిపితే చట్టాన్ని దిక్కరించినట్లుగ్గా పరిగణించాల్సిసి ఉంటుందన్నా. ఎన్నికల కోడ్, పోలీస్ చట్టం -30 తో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ముందస్తు అనుమతి లేకుండా మిర్చి యార్డులోకి ప్రవేశించి జగన్ ప్రజలను, రైతులను కలిశారన్నారు. మాజీ సీఎం జగన్ మిర్చి యార్డుకు వస్తున్నారని సమాచారం తెలిసింది వెంటనే ఆయనను చూసేందుకే ప్రజలు భారీగా తరలి రావడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం వాటిల్లిందన్నారు. దీనిని గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ హెడ్ సి హెచ్ . శ్రీనివాసరావు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. స్టేషన్ న ల్లపా ఫిర్యాదు మేరకు నల్లపాడు సిఐ వంశీధర్ వైయస్ జగన్ మోహన్ రెడ్డి తో పాటు మాజీ మంత్రులు కొడాలి వెంకటేశ్వరరావు ఉరఫ్ నాని , అంబటి రాంబాబు, పెర్ని నాని, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణ రెడ్డి , మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లు తులసి రఘురాం , లేళ్ళ అప్పి రెడ్డి లపై కేసు నమోదు చేశామన్నారు.

# ఉత్సాహపరితంగా అంగన్వాడీల శిక్షణా తరగతులు

**బొల్లాపల్లి మేజర్ న్యూస్:**

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీల శిక్షణ తరగతులు లాసభరితంగా సాగుతున్నాయి. ఆటపాటలతో కూడిన శిక్షణా తరగతులు కావడంతో అంగన్వాడి కార్యకర్తలు ఆనందంగా గడుపుతున్నారు. బొల్లాపల్లి మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్లో ప్రారంభించిన శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా ఎంఈఓ సిడిపిఓలు హాజరై ప్రసంగించడంతోపాటు చిన్నారులను ఎలా ఆకర్షించాలి అనే విధివిధానాలను వివరించడంతోపాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాలను గూర్చి వివరించారు కార్యక్రమంలో శిక్షకులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



## నేడు జిఎంసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

**గుంటూరు నగరపాలక సంస్థ మేజర్ న్యూస్ :**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మి కులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు ఈ నెల 21న (శుక్రవారం) సాయం త్రం 4 నుండి 5 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికుల, ఉద్యో గుల సమస్యల పరిష్కారంకు వర్కర్స్ గ్రీవెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు తమ సర్వీసుకు సంబందించిన సమ స్యలు, కార్మికులు ప్రధానంగా పిఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నిర్దేశిత గడువులోనే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్:**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే పనులను ప్రాధాన్యత క్రమంలో నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా ఏఈలు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం కమీషనర్ తమ రోజు వారీ పర్యటనలో భాగంగా సంగడిగుంట, ఎల్ఎల్ఆర్, పాత గుంటూరు, గణేష్ నగర్ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులైన రోడ్లు, డ్రైన్లు నిర్మాణ సమయాల్లోనే స్థానిక వార్డ్ సచివాలయ ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి పనులను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపాలను గుర్తిస్తే సంబందిత కార్యదర్శులు, ఏఈలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎల్ఎల్ఆర్ ని పరిశీలించి, త్రాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, రిజర్వాయర్లలో త్రాగునీటి సరఫరా చేయు సమయంలో క్లోరిన్ తనిఖీలు చేయాలన్నారు. త్రాగు నీరు సరఫరా సమయంలో వార్డుల్లో పర్యటిస్తూ నీటి నాణ్యతను పరిశీలించాలని, ఎక్కడైనా పైపు లైన్లు లీకులు గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేసి లీకులకు వెంటనే మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్యం, ఖాళీ స్తలాల సమస్యలపై ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, ప్రతి వార్డ్ సచివాలయం పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఓటు వెరిఫికేషన్ కై సమాచార కేంద్రం ఏర్పాటు

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు నగర పాలక సంస్థ మేజర్ న్యూస్ :**

కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గుంటూరు తూర్పు పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటుకు నమోదు చేసుకున్న వారికి ఓటు వెరిఫికేషన్ కోసం గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమాచార కేంద్రాన్ని (0863 %-% 2345103) శుక్రవారం నుండి ఏర్పాటు చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు చేసుకున్న వారికి నగర పాలక సంస్థ బి.యల్.ఓ లు వారి ఓటు ఎక్కడ ఉన్నది, ఓటు ఏ ఎక్కడ వేయాలి తదితర వివరాలతో కూడిన ఓటర్ స్లిప్పులను గృహాలకు వచ్చి అందజేస్తున్నారన్నారు. ఎవరికైనా ఓటర్ స్లిప్పులు అందకపోతే నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నుండి ప్రత్యేకంగా యం.యల్.సి ఎలక్షన్లకు సంబంధించి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, సదరు కేంద్రంలో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి రాలేని పక్షంలో కాల్ సెంటర్ 0863 - 2345103కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. కావున పట్టభద్రుల ఎన్నికల ఓటు నమోదు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో యరపతినేని నిఖిల్, కూటమి నాయకులు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :**

ఈ రోజు పిడుగురాళ్ల పట్టణంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టబద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా యరపతినేని నిఖిల్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సి ఆర్ రాజన్, కమిటీ సభ్యులు కలిసి పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్, స్కాలర్స్ స్కూలు, ఇందిరమ్మ కాలనీలోని కస్తూరిబా గాంధీ బాలికల (మైనార్టీ) విద్యాలయం నందు, ఇండియా ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లను, ప్రభుత్వ టీచర్లను, నిరుద్యోగులను కలిసి మేనిఫెస్టోను వివరించి ఓట్ల అభ్యర్థించారు. ఈ సందర్భంగా యరపతినేని నిఖిల్ మాట్లాడుతూ.. ఈరోజు ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపియన్ కి ఇక్కడికి వచ్చినటువంటి చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సి ఆర్ రాజన్, డాక్టర్ ఉన్నం మల్లికార్జునరావు, కూటమి నాయకులందరికీ హృదయపూర్వక నమస్కారాలు తెలుపుతూ.. ఈనెల 27వ తారీఖున ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగబోతుంది. కూటమి అభ్యర్థిగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఆలపాటి రాజాను నిలబెట్టటం జరిగింది. గత



ఐదేళ్లుగా చాలా ఇబ్బందులు పడి ఉన్నారు మీ అందరికీ తెలుసు. ఆరోజు ఉద్యోగులు, నిరుద్యోగులు చేసిన పోరాటంలో కూడా, ప్రతిపక్ష నాయకుడుగా చంద్రబాబు నాయుడు, మేమందరం మద్దతు ఇచ్చాం. మీకు ఇచ్చిన హామీలను ఆరోజు చంద్రబాబు నాయుడు పరిగణలోకి తీసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడు నెలలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు పరచడం జరుగుతుంది. మీ అందరికీ తెలుసు మన ఆర్థిక పరిస్థితి గత ఐదేళ్లుగా ఏ విధంగా దిగజారిపోయిందో, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఈ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నారు. మీకు ఇచ్చిన హామీలు కూడా తప్పకుండా అమలు చేయటానికి కృషి చేస్తున్నారు. మీకేదైతే గ్రాడ్యుటి జీవో ఉందో అది ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోగానే అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మీరందరూ రేపు జరగబోయే ఎన్నికలలో ఆలపాటి రాజాను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే రాబోయే రోజుల్లో మీ అందరి సహాయ సహకారాలతో ఆలపాటి రాజా మీ అందరి తరపున ప్రతినిధిగా హామీలు నెరవేర్చటానికి కూటమి ప్రభుత్వం ఉపయోగపడుతుంది. మీరందరూ ఈ ప్రభుత్వానికి అండదండలుగా ఉంటే మీ అందరికీ ఈ ప్రభుత్వం అండగా ఉండడానికి సహాయపడుతుందని తెలియజేసుకుంటూ, ఈ ప్రభుత్వంలో ఉన్న స్థానిక శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు వీరిద్దరు ఎప్పుడూ మీకు అండగాఉంటారని తెలియజేసుకుంటున్నాను. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేయడం జరుగుతుందన్నారు.